క్లుప్తంగా

ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఆహ్వానం అందజేస్తున్న గ్రామస్తులు

నేరడిగొండ: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మండలంలోని వాగ్దారి గ్రామస్తులు ఆదివారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. గ్రామంలో ఈనెల 20, 21న తేదీల్లో జరిగే శ్రీశ్రీశ్రీ పరమా హంస సద్గురు పూలాజీ బాబా సిద్ధ మహాయోగ పీఠం 22వ వార్షికోత్సవానికి హాజరు కావాలని ఆహ్వానించారు. సానుకూలంగా స్పందించిన ఆయన తప్పకుండా హాజరవుతానని పేర్కొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన సభ్యులు

ఇచ్చోడ: మండలంలోని తలమద్రిలో ఆదివారం ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని ఇచ్చోడ మండల ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి చిట్టి రవి, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పసుల శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గసికంటి గణేష్, ఉపాధ్యక్షుడిగా సిపెల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా గసికంటి లింగన్న, కోశాధికారిగా సిపెల్లి శ్రీను, ప్రచార కార్యదర్శిగా గసికంటి ఆనంద్, సలహా సభ్యులుగా గంగన్న, లక్ష్మణ్, రాజశేఖర్, మోహన్, ప్రశాంత్, శంకర్, విలాస్, రాకేశ్, శేఖర్, స్వామి, రాజన్నలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

'రైతు ఆత్మహత్య బాధాకరం'

బేల: రేణుగూడ గ్రామానికి చెందిన రైతు జాదవ్ దేవ్‌రావు ఆత్మహత్య బాధకరమని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఇటీవల (ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఓ బ్యాంకులో) ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన రైతు జాదవ్ దేవ్‌రావు సొంత గ్రామంలో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించగా, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రైతు కుటుంబానికి న్యాయం చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: ఉట్నూర్ మండలంలోని లింగోజితాండ దేవిదాస్‌నగర్‌కు చెందిన కౌలు రైతు రాథోడ్ గోకుల్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న డిమాండ్ చేశారు. ఈనెల 12న గడ్డి మందు తాగి రిమ్స్‌లో చికిత్స పొందుతుండగా ఆదివారం మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న జోగు రామన్నతో రిమ్స్‌కు చేరుకొని కుటుంబీకుల ద్వారా వివరాలను అడిగి తెలుసుకున్నారు.

క్షతగాత్రులకు పరామర్శ

ఆదిలాబాద్‌టౌన్: నార్నూర్ మండలంలోని మాలేపూర్ ఘాట్ వద్ద ఆదివారం జరిగిన ఘటనలో గాయపడిన క్షతగాత్రులను కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో చికిత్స పొందుతున్న వారిని బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పరామర్శించారు.

డ్యాన్స్ పోటీల్లో ప్రతిభ

బోథ్: హైదరాబాద్‌లో నిర్వహించిన ఓపెన్ డ్యాన్స్ పోటీల్లో మండలంలోని సొనాల గ్రామానికి చెందిన ఇర్ల మణికంఠ ఉత్తమ ప్రతిభ కనబర్చారు. పోటీల్లో అగ్ర స్థానంలో నిలిచి ఆదివారం బహుమతిని అందుకున్నారు. రఘు మాస్టర్ చేత బహుమతిని స్వీకరించారు. కాగా ఆయనను గ్రామస్తులు అభినందించారు.

'బ్యాంకు అధికారులపై చర్య తీసుకోవాలి'

ఎదులాపురం: రైతు ఆత్మహత్యకు కారణమైన ఐసీఐసీఐ బ్యాంకు అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఒక్క వాయిదా ఆలస్యం కావడంతో బ్యాంక్ అధికారులు వేధింపులకు గురి చేశారని పేర్కొన్నారు. అధికారులపై హత్య కేసు నమోదు చేయాలని, అదే విధంగా బాధిత కుటుంబానికి కోటి రూపాయల పరిహారం చెల్లించాలన్నారు.

అంగన్‌వాడీలకు భవనాలు నిర్మిస్తాం

బేల: జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రం భవనాలు లేనటువంటి ప్రతీతీతీ గ్రామంలో అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు చేయిస్తామని ఆదిలాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని సిర్సన్న గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.12లక్షల వ్యయంతో అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మెంచు నరేందర్, రాందాస్, అశోక్ రెడ్డి, దత్తా నిక్కమ్, బోనిగిరివార్ గణేష్, పోత్రాజ్ నవీన్, బర్కాడే రాము, జీవన్ పాల్గొన్నారు.

ఇచ్చోడలో కిష్కింధకాండ



గుంపులు గుంపులుగా సంచరిస్తున్న కోతులు



కోతులను తరలించాలని అధికారులకు వినతిపత్రం అందచేస్తున్న ఇస్లాంపూర కాలనీవాసులు (ఫైల్)

- తీవ్రమవుతున్న కోతుల బెడద
- గుంపులు గుంపులుగా సంచారం
- భయాందోళన చెందుతున్న ప్రజలు

ఇచ్చోడ: మండల కేంద్రంలో కోతులు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఇంటి మేడపైకి వెళ్లాలంటనే మహిళలు భయాందోళన చెందుతున్నారు. ఇంటి ఆవరణలో కూర్చోవాలంటేనే జంకుతున్నారు. ఆదమరిచి ఇంటి తలుపులు తెరిస్తే గుట్టుచప్పుడు కాకుండా ఇంట్లోకి దూరి ఇంట్లో సామాన్లను చిందరవందర పడుస్తున్నాయి. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతురన్నారు.

గుంపులు గుంపులుగా..

మండల కేంద్రంలో కోతులు గుంపులు గుంపులుగా సంచారిస్తూ.. ఎదురు తిరిగిన వారిపై దాడులు చేస్తున్నాయి. ఇళ్ల దాబాలపై సంచారిస్తు ఇళ్లలోకి చొరబడుతున్నాయి. డాబాలపై బట్టలు ఆర బెట్టుకోవడానికి సైతం ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. డాబాలపై ఆరబెట్టిన బట్టలను ఎత్తుకొనిపోయి ఎక్కడబడితే అక్కడే పడేస్తున్నాయి. ఎవరైనా బెదిరిస్తే చాలు మీదికి వచ్చి దాడి చేస్తున్నాయి. ఇప్పటికే కోతుల దాడిలో చాలా మంది ప్రజలు గాయపడ్డారు.

పెరుగుతున్న కోతుల సంఖ్య..

గతంలో కన్న కోతుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతున్నాయి. గతంలో పదుల సంఖ్యలో ఉన్న కోతులు ప్రసుతం వందల సంఖ్యలో పెరిగాయి. చిన్న పిల్లలతో పాటు పెద్దపెద్ద కోతులు మండల కేంద్రంలో సంచారిస్తూ.. ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. రాత్రి, పగలే అనే తేడా లేకుండా సంచారిస్తూ.. చిన్న పిల్లలు, వృద్ధులను గాయపరుస్తున్నాయి.

రక్షణ కల్పించాలి



కోతుల బెడద నుంచి రక్షణ కల్పించాలి. ఎప్పుడు ఎటు దిక్కు నుంచి కోతులు వచ్చి దాడి చేస్తాయో తెలియడంలేదు. ఇండ్లలోకి చొరబడి వస్తువులు ఎత్తుకెళ్తున్నాయి. కోతుల నుంచి రక్షణ కల్పించాలి.

– కాతారి కృష్ణ, ఇచ్చోడ, రెడ్డికాలనీ

కోతులను తరలించాలి



కోతుల సంచారంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. స్కూలకు వెళ్లే విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. కోతులను పట్టుకొని, ఇతర ప్రాంతాలకు తరలించాలి.

అబ్దుల్ రషీద్, ఇస్లాంపూర కాలనీ

దాడులు చేస్తున్నాయి



గుంపులు గుంపులుగా సంచారిస్తూ.. దాడులు చేస్తున్నాయి, ఎవరైనా బెదిరిస్తే చాలు మీదికి వచ్చి దాడి చేస్తున్నాయి. కోతుల దాడుల్లో పలువురు గాయ పడ్డారు. చిన్న పిల్లలు, వృద్ధులు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు.

– పెరమళ్ల స్వామి

సదల్‌పూర్ జాతరకు వేళాయె

- ఈనెల 23నుంచి జంగీ జాతర
- భైరందేవ్, మహాదేవ్ ఆలయాల్లో అభిషేకంతో ప్రారంభం
- 29న కాలదహి హండీతో ముగింపు



ఆలయం వద్ద భక్తుల సందడి

బేల: ప్రతి ఏటా పుష్యమాసంలో వారం రోజులు నిర్వహించే జంగీ జాతర మండలంలోని అటవీ సమీపంలోని సదల్‌పూర్ భైరందేవ్, మహాదేవ్ ఆలయంలో ఈనెల 23 నుంచి ప్రారంభం కానుంది. ఏటా పుష్యమాసం నవమి రోజున ఆలయాల్లో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేస్తారు. వారం రోజుల పాటు కొనసాగించి, అమవాస్య రోజు కాలదహి హండీ కార్యక్రమం నిర్వహించి జాతర ముగింపు ఘనంగా నిర్వహిస్తారు. కాగా ఈ జాతర ఆదివాసీ పూర్వీకుల సాంప్రదాయబద్ధంగా 56ఏళ్ల నుంచి నిర్వహిస్తుండగా, గత 31ఏళ్ల నుంచి దర్బార్‌సభ నిర్వహిస్తున్నారు.

జాతర షెడ్యూల్ ఇలా..

ఈసారి ఈనెల 23న జాతర ప్రారంభం కానుంది. 26 నుంచి కబడ్డీ పోటీలు ప్రారంభం కానున్నాయి. 27న ఆదివాసీ దర్బార్ సభ ఉంటుందని, 29న కాలదహి హండీ నిర్వహణతో జాతర ముగింపు ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

క్రీడలతో స్నేహభావం



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌రూరల్: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణ శివారు ప్రాంతంలోని బెల్లూరిలో నిర్వహించిన ఏసీఎల్ టోర్నమెంట్ 13వ సీజన్ క్రికెట్ ముగింపు కార్యక్రమానికి ఆదివారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఫైనల్ మ్యాచ్‌లో 11స్టార్, న్యూస్టార్ జట్లు తలపడగా 11 స్టార్ జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా విజేతలకు జోగు ఫౌండేషన్ తరపున రూ.50వేల నగదు బహుమతితో పాటు ట్రోఫీ ప్రదానం చేశారు. సామాజిక కార్యకర్త మౌనిష్ రెడ్డి విన్నర్, రన్నర్‌ఆఫ్ ట్రోఫీని అందించారు. అనంతరం జోగు రామన్న మాట్లాడుతూ గత 13 ఏళ్లుగా ఆదిలాబాద్ క్రికెట్ లీగ్ విజయవంతంగా కొనసాగుతుందని కమిటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో సాజిదొద్దీన్, యూనుస్ అక్బాని, బట్టు సతీష్, బుట్టి శివ, షేక్ ఆలం, అయ్యుబ్, అద్నాన్, జమిల్, అఫ్సర్, శేఖర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



అడేగామ(కె)లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

ఇచ్చోడ: గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని అడేగామ(కె) ఎస్సీ కాలనీలో పర్యటించి కాలనీ వాసులతో మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీలో తాగునీటి సమస్య ఉందని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. రెండు రోజుల్లో బోరు వేయించి కాలనీ వాసులకు తాగునీటీ సమస్య లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల్లో సమస్యలు లేకుండా పరిష్కారించడానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, ఇచ్చోడ మాజీ ఉపసర్పంచ్ లోక శీరిష్‌రెడ్డి నాయకులు గాడ్గే సూభాష్, పాండురంగ్, నర్వాడే రమేశ్, బద్దం రాంచెందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పరామర్శ

బోథ్: మండలంలోని పొచ్చెర గ్రామానికి చెందిన కలిగేటి సంటెన్న ఇటీవల మృతి చెందడంతో, విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదివారం మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఆటల్లో గెలుపోటములు సహజం

బోథ్: ఆటల్లో గెలుపోటములు సహజమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని పొచ్చెర గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌కు ఆయన హాజరయ్యారు. ఈ మ్యాచ్‌లో ఎస్ఎస్‌యూఐ నిర్ణీత 15 ఓవర్లలో 135 రన్స్ చేయగా.. ఇచ్చోడ జట్టు సైతం 135 రన్స్ సాధించింది. మ్యాచ్ డ్రా కాగా, సూపర్ ఓవర్ నిర్వహించారు. సూపర్ ఓవర్‌లో ఇచ్చోడ జట్టు విజయం సాధించింది. విజయం సాధించిన ఇచ్చోడ జట్టుకు విన్నంగ్ కప్‌తో పాటు రూ. 25 వేల బహుమతి అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన ఎస్ఎస్‌యూఐ జట్టుకు రూ. 15 వేలు అందజేశారు. యువత క్రీడాస్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, దివాకర్ రెడ్డి, రాజారెడ్డి, రమణ రెడ్డి, శమేందర్ రెడ్డి, చింటు రెడ్డి, రాజు, ప్రవీణ్ రెడ్డి, శ్రావణ్, సురేందర్, సదానంద్ పాల్గొన్నారు.

అనుసంధానమెప్పుడో..?



సాగవుతున్న మొక్కజొన్న

- ఉపాధిని సాగుకు అనుసంధానిస్తే మేలు
- ప్రతీఏటా వెంటాడుతున్న కూలీల కొరత
- అన్నదాతపై పెరుగుతున్న పెట్టుబడి భారం

నేరడిగొండ: ఆరుగాలం శ్రమిస్తూ దేశానికి అన్నం పెట్టే రైతన్నకు ఏటా సాగు కష్టాలు తప్పడం లేదు. ప్రధానంగా ప్రతీ సీజన్‌లో కూలీల కొరత వెంటాడుతోంది. ఇది పెట్టుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈక్రమంలో ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలంటూ రైతు సంఘాలు ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వాలకు విన్నవించాయి. నీతి ఆయోగ్ సైతం అనుసంధానమే అన్నదాతకు మేలంటూ తన నివేదికలో పేర్కొంది.

రైతులపై భారం..

వ్యవసాయ పనులకు ఉపాధిహామీ పథకం అనుసంధానం చేస్తే రైతులకు 30 శాతం మేలు చేకూరుతుందని మేధావులు, రాజకీయ అనుభవజ్ఞులు అభిప్రాయ పడుతున్నారు. కూలీల కొరత అధిగమించడంతో పాటు రైతులు అనేక రకాల పంటలు పండించేందుకు వీలు కలుగుతుంది. జిల్లాలో పత్తి సాగు విస్తీర్ణమే అధికం. పంట చేతికి వచ్చిన తర్వాత పత్తి ఏరేందుకు కూలీల కొరత సమస్య ఏటా వెంటాడుతూనే ఉంది. ఈ క్రమంలో కూలి పెంపు తప్పనిసరవుతోంది. కూలీలను పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి ఆటోలు, జీపుల్లో తీసుకు రావాల్సిన దుస్థితి. వారికి కూలితో పాటు రానుపోనూ చార్జీలు సైతం రైతులే చెల్లించాల్సి వస్తోంది. అన్నదాతపై పెట్టుబడి భారం పెరుగుతోంది. మరోవైపు గిట్టుబాటు ధర అందకపోవడం, తేమ పేరిట కోతలు ఏటా పరిపాటిగా మారాయి.

'ఉపాధి'ని అనుసంధానిస్తే ఇలా..

ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానిస్తే రైతులకు మేలు జరుగుతుంది. విత్తనాలు వేయడం, పత్తి ఏరడం, పంట సాగులో ఇతరత్రా పనులకు ఉపాధి కూలీలను ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. కూలీలకు సైతం ఏడాది పాటు ఉపాధి దొరుకుతుంది. ఇప్పటికే ఈ పథకం ద్వారా వ్యవసాయంలో పలు పనులు చేర్చారు. పూర్తిస్థాయిలో అనుసందానిస్తే ఇటు రైతులకు, అటు కూలీలకు లాభం చేకూరుతుంది.

కూలీల కొరత..



ప్రతిఏటా కూలీల కొరత తీవ్రంగా ఉంటుంది. పత్తి తీయడం ఇబ్బందవుతుంది. దీంతో పక్క రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి కూలీలను తీసుకువస్తున్నారు. వారు రావడానికి, తిరిగి వెళ్లడానికి ఆటో చార్జీలు సైతం చెల్లిస్తున్నారు. వ్యవసాయానికి ఉపాధిహామీ పథకాన్ని అనుసంధానిస్తే కూలీల కొరత ఉండదు.

– సంగెపు బొర్రన్న, రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి



మాట్లాడుతున్న మనోజ్

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలోని బేల మండలం సైద్‌పూర్ గ్రామ పంచాయతీకి చెందిన రైతు జాదవ్ దేవ్‌రావ్ కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవ్‌రావ్ అనే రైతు ఆత్మహత్యకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆ రైతు కుటుంబానికి రూ. 50 లక్షల నుంచి కోటి రూపాయల వరకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించాలన్నారు. సమావేశంలో ఆదివాసీ కొలాం సేవా సంఘం నాయకుడు కొడప సోనేరావు, తెలంగాణ మాదిగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నక్క రాందాస్ మాదిగ, లక్ష్మణ్, చందు, తదితరులు పాల్గొన్నారు.

చట్ల ఉమేశ్ సేవలు భేష్



ఉమేష్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బోథ్: మండల కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త చట్ల ఉమేశ్ సేవలు భేష్ అంటూ ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు. ఆయన చేస్తున్న సేవలకు బోథ్ ప్రభుత్వ ఉపాధ్యాయుల వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జెడ్పీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఉమేశ్‌ను సన్మానించారు. ఎమ్మార్సీ భవనం ఆవరణం గుంతలుగా మారడంతో ఉపాధ్యాయులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన మొరం వేయించారు. కార్యక్రమంలో ఎంఈవో కుమ్మరి పోశెట్టి, ఉపాధ్యాయులు ఆర్టీవీ ప్రసాద్, అప్పాల శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ, అమరేందర్, హన్మాండ్లు, శంకర్, గంగారాం, పడిగెల విజయకుమార్, లక్ష్మణ్, గంగయ్య, సాగర్, రమేశ్, బ్రహ్మానందం, రఘుపతి, సురేశ్ వైద్య, మురళిధర్, జి.శంకర్, గణపతి, రాజేశ్వర్ రెడ్డి, సదానందం, దివాకర్ రెడ్డి, మోహినొద్దీన్, నరేందర్, శంకర్, శివయ్య పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గురువులు

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని వాఘాపూర్ పాఠశాలలో ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. 2008–09 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు సందడిగా గడిపారు. అనాడు విద్యాబోధన చేసిన గురువులను శాలువాతో సన్మానించారు. తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. యోగా క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు గురువులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రత్నాకర్, నారాయణ, రాజేశ్వర్ రెడ్డి, శంకరయ్య, సీతారాం పండిత్, శ్రీనివాస్, నర్సింగ్‌రావు, హర్షవర్ధన్ పాల్గొన్నారు.

'ఊరి కోసం ప్రాణమైనా ఇస్తా'



బహుమతులు అందజేసిన ఆడే గజేందర్

నేరడిగొండ: ఊరి కోసం ప్రాణమైన ఇస్తానని, అందరం కలిసి ఉండి అభివృద్ధి చేసుకుందామని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. ఆదివారం బొందిడి ప్రీమియర్ లీగ్ (బీపీఎల్) టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌కు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు డప్పువాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువకులు క్రీడల్లో రాణిస్తే జీవితంలో ఎంత పెద్ద ఇబ్బంది వచ్చినా ధైర్యంగా ఎదుర్కొనవచ్చన్నారు. క్రీడలతో మానసికోల్లాసం, శారీరక దృఢత్వం లభిస్తుందన్నారు. క్రీడాకారులు క్రీడల్లో పాల్గొనడానికి ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లడం వల్ల వారిలో స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలపై మక్కువ పెంచుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆడే జనార్దన్, రాథోడ్ మధుకర్, నాయుడు రవి, ఆడే సతీష్ నాయక్, సద్దాం, ఆడే రవీందర్, శంకర్ జాదవ్, కబీర్, నాయక్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా శనగపంట



ఈఏడాది యాసంగి సీజన్‌లో రైతులు సాగు చేసిన శనగ పంట ఆశాజనకంగా ఉంది. ప్రస్తుతం కాత దశలో ఉన్న శనగపంటకు వాతావరణం అనుకూలంగా ఉండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తాంసి, భీంపూర్ మండలాల్లో అధికరంగా రైతులు శనగపంట సాగు చేశారు. పంటకు తెగుళ్ల బెడద, పురుగు ఉధృతి లేకపోవడంతో ఆశించిన దిగుబడి వచ్చేలా ఉందని ఆశలు పెట్టుకున్నారు. మరో నెల రోజుల్లో పంట చేతికి వచ్చే అవకాశం ఉంది. - తాంసి

'హోయ్' వే



భీంపూర్ మండల కేంద్రానికి సమీపంలో రోడ్డు ఇరువైపులా నాటిన మొక్కలు పచ్చదనంతో ఆకట్టుకుంటున్నాయి. అటువైపు వెళ్లే వారికి స్వాగతం పలుకుతున్నట్లు అలరిస్తున్నాయి. హరితహారంలో భాగంగా గతంలో రోడ్డు ఇరువైపులా నాటిన మొక్కలు ఏపుగా పెరిగి కనువిందుగా కనిపిస్తున్నాయి. భీంపూర్ నుంచి సెంటర్‌సాంగ్వి గ్రామం వరకు అర కిలోమీటర్ మేర చెట్లు పచ్చదనంతో కళకళలాడుతూ కనిపిస్తున్నాయి. – తాంసి

సాగు భూములకే రైతుభరోసా



మాట్లాడుతున్న ఆర్ఐ హుస్సేన్

ఇచ్చోడ: ప్రభుత్వ ఆదేశాల మేరకు సాగు భూములకు రైతుభరోసా ఇవ్వనున్నట్లు ఆర్ఐ హుస్సేన్ అన్నారు. ఆదివారం మండలంలోని గేర్జంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. గతంలో పట్టాపాసు పుస్తకంలో ఉన్న భూముల ఆధారంగా రైతు బంధు వచ్చేదని, ప్రసుతం వ్యవసాయ యోగ్యం ఉన్న భూములకు మాత్రమే రైతుభరోసా అందచేయనున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయ భూములలో కట్టాడాలు, లే అవుట్లు, భవనాల నిర్మాణాలు, రోడ్లు ఇతర నిర్మాణాలు ఉంటే రైతుభరోసా రాదన్నారు. గ్రామ సభలో గ్రామస్తులు పాల్గొన్నారు.